సాక్షి
ఖమ్మం
సోమవారం ׀ 6 ׀ జనవరి ׀ 2025



రైతు భరోసాకు కసరత్తు..!

రైతు భరోసా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వగా ఉమ్మడి జిల్లాలో సుమారు 5 లక్షల మంది లబ్ధి చేకూరనుంది. 8లో



ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా జిల్లా వాసి

శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కొణిజర్ల మండలం గోపవరానికి చెందిన జాస్తి రవికుమార్ నియమితులయ్యారు. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



ఖమ్మంవన్ టౌన్/ఎర్రుపాలెం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి బయలుదేరి 11 గంటలకు ఎర్రుపాలెం మండలం మీనవోలుకు చేరుకుంటారు. 11.10 గంటలకు రూ.21 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.50 గంటలకు ఎర్రుపాలెం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, ఎర్రుపాలెం నుంచి మధిరకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణాలకు, 12.50 గంటలకు పెగళ్లపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి, 1.30 గంటలకు తెల్లపాలెం, కంద్రిక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 3.30 గంటలకు జోనల్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహిస్తారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి కోరారు.

ఉపకార వేతన దరఖాస్తుల గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్ : 2024 – 25 విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తుల గడువును మార్చి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. బ్యాంక్ అకౌంట్ లేని నూతన విద్యార్థులు పోస్టల్ అకౌంట్ పొందాలని సూచించారు. ప్రిన్సిపాళ్ల డిజిటల్ కీ కొనుగోలు చేసి ఈ–పాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, విద్యార్థుల ఉపకార వేతన దరఖాస్తులు డిజిటల్ సంతకం ద్వారానే జిల్లా అధికారి లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని సూచించారు.

'పది'లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి



మోటివేషన్ చేస్తున్న రామారావు

ఖమ్మంమయూరిసెంటర్ : బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని బీసీ అభివృద్ధి అధికారిణి గుడికందుల జ్యోతి అన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఖమ్మంలోని ముస్తఫానగర్ బీసీ వసతి గృహంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రభుత్వం హాస్టళ్లలో మెరుగైన వసతి, సౌకర్యాలు, నాణ్యమైన భోజనం అందిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వచ్చే మూడు నెలల కాలం లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళిక ప్రకారం అన్ని సబ్జెక్టులను చదవాలని, మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు ఎలా ప్రిపేర్ కావా లనే అంశాలపై విద్యార్థులకు మోటివేషన్ స్పీకర్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏబీసీడీఓ ఎం.ఈదయ్య, ఉపాధ్యాయులు ఉపేంద్రయ్య, జె.జగదీష్, ఎన్.రమేష్, మోటివేషన్ స్పీకర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై శ్రద్ధ పెట్టండి

ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



పామాయిల్ నర్సరీని పరిశీలిస్తున్న రాఘవరెడ్డి తదితరులు

సత్తుపల్లిరూరల్ : పామాయిల్ మొక్కలపై శ్రద్ధ పెట్టి పెంచాలని, ఎప్పటికప్పుడు నీటి సదుపాయం కల్పించాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెంచుతున్న నాలుగు లక్షల పామాయిల్ మొక్కల నర్సరీని ఆదివారం ఆయన పరిశీలించారు. పామాయిల్ మొక్కల పెంపకంలో జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో జీఎం సుధాకర్‌రెడ్డి, డివిజనల్ అధికారి బాలకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ పాల్గొన్నారు.

భూగర్భ జలహాసం!



- గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు
- జిల్లాలోని 16 మండలాల్లో నీటిమట్టం పెరుగుదల
- నగటున 0.88 మీటర్ల పైకి భూగర్భ జలాలు
- యాసంగిలో ఊపందుకుంటున్న సాగు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో భూగర్భ జల మట్టం పెరిగింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన అతి భారీ వర్షాలకు నీటిమట్టం పైకి వచ్చింది. 2023 డిసెంబర్‌తో పోలిస్తే 2024 డిసెంబర్‌లో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించింది. 2023లో జిల్లా సగటు 4.75 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. 2024 డిసెంబర్‌లో 3.87 మీటర్ల పైకి వచ్చాయి. దాదాపు 0.88 మీటర్ల పైకి జలాలు చేరాయి. దీంతో యాసంగిలో బోర్లు, బావుల కింద పంటల సాగు ఆశాజనకంగా ఉండనుంది. ఇప్పటికే యాసంగి సాగు మొదలు కాగా.. నీరు పుష్కలంగా అందుబాటులో ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ అట్టడుగున నీరు ఉండే సత్తుపల్లి వంటి ప్రాంతాల్లోనూ ఈసారి భూగర్భ జలాలు పైకి చేరుకోవడం గమనార్హం. ఇక్కడ దాదాపు 3.57 మీటర్ల పైకి నీరు రావడంతో ఈ ప్రాంతంలోనూ యాసంగి సాగుకు ఢోకా లేదు. వీటితో పాటు జిల్లాలోని దాదాపు 15 మండలాల్లో భూగర్భ జలాలు చెప్పుకోదగిన రీతిలో పెరగడం శుభసూచకం.

గత యాసంగిలో అంతంతే..

యాసంగిలో పంటల సాగుకు బోర్లు, బావులే ఆధారం. అయితే గతేడాది భూగర్భ జలమట్టం ఆశాజనకంగా లేదు. 2023 కంటే కూడా భూగర్భ జలాలు మరింతగా కిందకు వెళ్లాయి. 2024 మార్చిలో 6.86 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఏప్రిల్‌లో 7.56 మీటర్లకు, మే లో 7.30 మీటర్లకు, జూన్‌లో 6.99 మీటర్లకు జలాలు పడిపోయాయి. దీంతో యాసంగిలో పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సీజన్‌లో అకాల వర్షాలు కురిస్తే భూగర్భ జల మట్టం పెరుగుతుంది. 2023లో అకాల వర్షాలతోనే నీటిమట్టం పెరిగింది. అయితే 2024 వేసవిలో అకాల వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అంతకంతకూ అడుగంటి బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి.

కలిసొచ్చిన వర్షాలు..

గత ఏడాది ఆగస్టు చివరి, సెప్టెంబర్ మొదటి వారాల్లో భారీ వర్షాలు కురిశాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భ జలాల్లో పెరుగుదల కనిపించింది. సెప్టెంబర్‌లో 2.49 మీటర్ల లోతులోనే నీరు ఉండడం గమనార్హం. అక్టోబర్‌లో 2.71 మీటర్లు, నవంబర్‌లో 3.33 మీటర్లు, డిసెంబర్‌లో 3.87 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. వానాకాలంలో భారీ వర్షాలతో ప్రాజెక్టులు, వాగులు పొంగి పొర్లడంతో పాటు భూగర్భ జలాలు పైకి చేరుకున్నాయి. దీంతో పంటల సాగుకు ఇబ్బంది కలగలేదు. బోర్లు, బావుల ద్వారా పండే పంటలు కూడా మంచి దిగుబడులు ఇచ్చాయి.

సాగుకు సానుకూలం..

భూగర్భ జలాలను పరిశీలిస్తే ఈసారి యాసంగి సాగుకు సానుకూల సంకేతాలు వస్తున్నాయి. రైతులు ఇప్పటికే యాసంగి సాగు వైపు అడుగులు వేస్తున్నారు. దుక్కులు దున్నడంతోపాటు వరినారు మడులు పోశారు. బోర్లు, మోటార్ల సాయంతో యాసంగిలో వరితో పాటు ఇతర ఆరుతడి పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. 2023 డిసెంబర్‌లో 4.75 మీటర్ల లోతులో నీరు ఉండగా 2024 డిసెంబర్‌లో 3.87 మీటర్ల లోతులోనే ఉంది. దీంతో ఈ యాసంగిలో భూగర్భ జలాలు అందుబాటులో ఉంటాయనే ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. గతేడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భూగర్భ జలాలు 6 నుంచి 8 మీటర్ల లోతుల్లోకి వెళ్లాయి. ఈసారి కొద్దిమేర తగ్గినా 5 మీటర్ల లోతుల్లో అయినా నీరు ఉంటుందనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

సత్తుపల్లి, ముదిగొండలో మెరుగు..

జిల్లాలోని 21 మండలాలకు గాను దాదాపు 16 మండలాల్లో 2023 డిసెంబర్ కంటే 2024లో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. సత్తుపల్లిలో భూగర్భ జలాలు పెరగడం చెప్పుకోదగ్గ పరిణామం. సహజంగా ఇక్కడ భూగర్భ జలాలు చాలా లోతులో ఉంటాయి. 2023 డిసెంబర్‌లో సత్తుపల్లి మండలంలో 16.17 మీటర్ల లోతులో ఉండగా 2024 డిసెంబర్‌లో 12.6 మీటర్లలో ఉన్నాయి. అంటే దాదాపు 3.57 మీటర్ల పైకి నీరు చేరుకుంది. ముదిగొండలోనూ భూగర్భ జలాలు పెరిగాయి. ఇక్కడ గతంలో 3.03 మీటర్లు ఉండగా.. గత డిసెంబర్‌లో 1.19 మీటర్లకు చేరాయి. దాదాపు 1.84 మీటర్లు పెరగడం విశేషం. రఘునాథపాలెం మండలంలో 4.83 మీటర్ల నుంచి గత డిసెంబర్‌లో 3.47 మీటర్లకు నీరు చేరింది. ఇక పెనుబల్లిలో 4.68 మీటర్లకు గాను గత డిసెంబర్‌లో 3.36 మీటర్ల పైకి నీరు చేరుకుంది.

2023, 2024 డిసెంబర్ నెలల్లో భూగర్భ జలాలు (లోతు.. మీటర్లలో)

మండలం	2023	2024
ఖమ్మంఅర్బన్	1.14	1.43
ఖమ్మంరూరల్	3.65	2.32
తిరుమలాయపాలెం	3.45	2.69
కూసుమంచి	4.30	4.31
నేలకొండపల్లి	2.68	2.19
బోనకల్	1.58	1.9
చింతకాని	3.53	2.84
ముదిగొండ	3.03	1.19
కొణిజర్ల	2.00	1.99
సింగరేణి	4.59	3.88
కామేపల్లి	7.92	6.83
మధిర	4.28	4.42
ఎర్రుపాలెం	5.66	5.61
వైరా	1.77	1.78
రఘునాథపాలెం	4.83	3.47
సత్తుపల్లి	16.17	12.6
వేంసూరు	4.84	3.67
పెనుబల్లి	4.68	3.36
కల్లూరు	2.86	2.8
తల్లాడ	3.13	2.31
ఏన్కూరు	7.86	5.8

సాయం కోసం నిరీక్షణ

- వరదలు వచ్చి నాలుగు నెలలైనా బాధితులకు మొండిచేయే
- పలువురికి అందని ప్రభుత్వ చేయూత
- కేఎంసీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- నిధులు రావాల్సి ఉందంటున్న యంత్రాంగం



వరద సాయం అందలేదని కేఎంసీలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు వరదలు వచ్చి నాలుగు నెలలు అయినా.. బాధితులు మాత్రం సాయం కోసం కేఎంసీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. తమ ఇళ్లలోకి వరదలు వచ్చి నష్టం జరిగిందని, అయినా ప్రభుత్వ సాయం అందలేదని, పక్కవారికి సాయం అందించి తమకు ఎందుకు ఇవ్వడం లేదని బాధితులు అధికారులను నిలదీస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1న మున్నేరుకు వచ్చిన భారీ వరదలతో వందలాది ఇళ్లు నీట మునిగి వేలాది కుటుంబాలు నష్టపోయాయి. బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.16,500 అందించేందుకు అధికారులతో సర్వే చేయించింది. వరదలు తగ్గిన వెంటనే అధికారులు సర్వే చేయగా.. 9,279 కుటుంబాలు నష్టపోయినట్లు గుర్తించారు. ఈ మేరకు 9,279 కుటుంబాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కానీ సాంకేతిక కారణాలతో 60 కుటుంబాల వారికి సాయం అందలేదు. కాగా, తమ ఇళ్లను సర్వే చేయనందున తమకూ సాయం అందించాలని బాధితులు కేఎంసీ కార్యాలయానికి క్యూ కట్టారు. ఈ నేపథ్యాన ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాలతో వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి మరోమారు సర్వే చేశారు.

ప్రభుత్వానికి నివేదికలు..

వరదలతో నష్టపోయినా సర్వేకు రాలేదని బాధితులు కేఎంసీ చుట్టూ తిరగడంతో అధికారులు రెండో సారి సర్వే చేసి 2,800 కుటుంబాల వారిని సాయానికి అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలను నమోదు చేసుకున్న అధికారులు ప్రభుత్వానికి పేర్లతో కూడిన నివేదికను పంపించారు. అయితే రెండో సారి సర్వే చేసిన కుటుంబాల వివరాలను ప్రభుత్వానికి పంపినా.. ఇప్పటి వరకు వారికి అందించే సాయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తోటి వారికి సాయం అందినా.. తమకు ఇంకా నష్టపరిహారం అందలేదని బాధితులు ప్రతి రోజు కేఎంసీ కార్యాలయానికి వచ్చి అధికారులను ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే వరద సాయం అందిస్తామని అధికారులు వారికి చెప్పి పంపిస్తున్నారు. ఇక ప్రతీ సోమవారం గ్రీవెన్స్‌లో బాధితులు అధికారుల వద్దకు వచ్చి తమకు సాయం ఎందుకు ఇవ్వడం లేదని వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో బాధితులకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ అంశంపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. మొదటి విడత సర్వే చేసిన బాధితులకు నగదు సాయం అందించామని తెలిపారు. ఈ విడతలో 70 మందికి సాంకేతిక కారణాలతో అందలేదని, రెండు, మూడు రోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. ఇక రెండో సారి సర్వే చేసిన వారికి మాత్రం సాయం నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని తెలిపారు.

వైష్ణవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న వైష్ణవ సంఘం సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్ : జిల్లా శ్రీ వైష్ణవ సేవా సంఘం క్యాలెండర్లను స్థానిక కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శేషభట్టార్ రఘునాథాచార్యులు, ప్రధాన కార్యదర్శి కొదమసింహం రవికిరణాచార్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌సీహెచ్ రామకృష్ణమా చార్యులు, జిల్లా కన్వీనర్ ఎన్‌సీహెచ్. శ్రీనివాసాచార్యులు, సహాయ కోశాధికారి శ్రీరాయపురం రామకృష్ణమాచార్యులు, జిల్లా కోశాధికారి వేదాంతం ఫణికుమారాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ మరింగంటి భార్గవాచార్యులు, జి.గోపాల్, గౌరవ సలహాదారు కండ్లకుంట్ల రంగాచార్యులతో పాటు సభ్యులు ఎం.కేశవాచార్యులు, ఎ.మాధవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రికెట్ విజేత 'వరంగల్ జోన్'



రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జోన్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

- రన్నరప్‌గా ఖమ్మం జోన్ జట్టు
- విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్ : కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. పోటీల్లో వరంగల్ జోన్ జట్టు ఘన విజయం సాధించి టైటిల్ సాధించింది. వరంగల్ జోన్ – ఖమ్మం జోన్ జట్ల మధ్య ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జోన్ నిర్ణీత 30 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. డేవిన్ 43, అజహాన్ 29, అభిలాష్ 12, సంతోష్ 13 పరుగులు చేయగా వరంగల్ బౌలర్లు హరిప్రసాద్ 3, వైష్ణవ్ 2, ఇబ్రహీం ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వరంగల్ జోన్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. ఆ జట్టులో విశాల్ యాదవ్ 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 పరుగులు చేశాడు. ఫర్హన్ 11, హరిప్రసాద్ 17 పరుగులు చేసి జట్టు విజయానికి సహకరించారు. ఖమ్మం బౌలర్లు నితిన్ 4, అజహర్ 3, శశి కుమార్‌లు ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్ కుమార్ రెడ్డి, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. రమణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.ఉపేందర్, పీడీ రఘునందన్, సెలెక్టర్లు ఎం. కుమార్, అఫ్జల్, గోపి, అస్లాం, ఎండీ మతిన్, ఆర్.ఉపేందర్, కమల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఎయిర్‌పోర్టు సర్వే..



రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 38 లక్షలు మంజూరు

- త్వరలో కొత్తగూడెంలో ప్రారంభం కానున్న సర్వే పనులు
- అటవీ, ప్రైవేటు భూములు సేకరించాలని నిర్ణయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు టెక్నో ఎకనామిక్ ఫీజిబులిటీ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.38 లక్షల బడ్జెట్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో మరోసారి ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సర్వే చేపట్టి నివేదిక సమర్పిస్తారు. రాష్ట్రంలో ఆరు రీజినల్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో కొత్తగూడెం కూడా ఉంది. గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సూచించిన స్థలంలో టెక్నో ఎకనామిక్ ఫీజిబులిటీ సర్వే చేపట్టారు. ఆ స్థలం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువుగా లేదని రిపోర్టులో తేలింది. దీంతో కొత్తగా రామవరం దగ్గర చూపిస్తున్న స్థలంలో మరోసారి సర్వే చేపట్టేందుకు బడ్జెట్ కేటాయించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కోరింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడంతో త్వరలోనే ప్రీ ఫీజుబులిటీ, ఓఎల్ఎస్ (ఆబ్‌స్టికల్ లిమిటేషన్ సర్వే)లు కూడా నిర్వహించనున్నారు. మూడేళ్లలో ఈ ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తేవాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

రామవరం – గరీబ్‌పేట–సుజాతనగర్

రేణుకా చౌదరి కేంద్రమంత్రిగా పని చేసిన కాలంలో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు అంశం తెర మీదకు వచ్చింది. సుజాతనగర్ ప్రాంతంలో నిర్మిస్తారనే వార్తలు షికారు చేసినా ఆ తర్వాత స్తబ్దత ఏర్పడింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక, పాల్వంచ మండలం గుడిపాడు –బంగారుజాల మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పలుమార్లు సర్వేలు జరిగాయి. పాల్వంచ పట్టణంలో ఓవైపు ఎత్తైన కొండలు ఉంటే మరోవైపు కేటీపీఎస్‌కు సంబంధించిన భారీ నిర్మాణాలు ఉన్నా యి. వీటితోపాటు ముర్రేడు, కిన్నెరసాని ప్రవాహాలు ఉన్నాయి. దీంతో సాంకేతికంగా పాల్వంచ పరిసర ప్రాంతాలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుకూలం కాదని తేలింది. ప్రస్తుతం కొత్తగూడెం సమీపంలోని గరీబ్‌పేట చుట్టూ చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల పరిధిలో తొమ్మిది వందల యాభై ఎకరాల విస్తీర్ణంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏడువందల ఎకరాలు ఫారెస్టు ల్యాండ్‌తోపాటు ఇతర ప్రైవేటు స్థలాలను సేకరించి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఉపయోగించాలని నిర్ణయించారు.

ఏడాది నుంచి జోరుగా..

17 ఏళ్ల నుంచి ఇప్పటివరకు కొత్తగూడెం ఎయిర్‌పోర్టు అంశంపై అనేక సార్లు ప్రతిపాదనలు రావడం, సర్వేలు జరగడం మళ్లీ ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టుగా పరిస్థితి ఉండేది. 2024 ఆరంభం నుంచి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పెద్దలకు స్వయంగా ఈ అంశంపై విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మున్సిపల్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతి పత్రం సమర్పించగా, అక్కడి నుంచి కూడా సానుకూల స్పందన వచ్చింది. ఏడాది కాలంగా ఎయిర్‌పోర్టు నిర్మాణంపై క్రమం తప్పకుండా సానుకూల ప్రకటనలు వస్తున్నాయి.

భద్ర'గిరి పల్లె'కు స్వాగతం!

- భద్రాచలంలో పర్యాటకానికి సొబగులు
- ఐటీడీఏలో శరవేగంగా సాగుతున్న పనులు
- వెదురు నిర్మాణాలతో ఇళ్లు, సెల్ఫీ పాయింట్



ఏపీ, తెలంగాణ గిరిజనుల మట్టి ఇంటి నిర్మాణం

భద్రాచలం: భద్రాచలం వచ్చే పర్యాటకులకు స్వచ్ఛమైన గిరిజన పల్లె అందాలను చూపించేందుకు సొబగులు అద్దుతున్నారు. విభిన్నమైన గిరిజన, ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను పట్టణవాసులకు, పర్యాటకులకు పరిచయం చేసేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ కృషి ఫలించనుంది. ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం పరిధిలో జరుగుతున్న గిరిజన పల్లె పనులు తుది దశకు చేరుకున్నాయి. ముక్కోటి ఉత్సవం రోజున భద్ర 'గిరి పల్లె'ను ప్రారంభించనుండగా కార్మికులు చేస్తున్న పనులు శరవేగంగా సాగుతున్నాయి.

అసోం ఆదివాసీల ఇంటి నిర్మాణం





గిరిజన మ్యూజియం ప్రాంగణంలో సిద్ధమవుతున్న గిరిజన పల్లె నమూనా

ఆదివాసీ నిర్మాణాలు, వంటకాలు..

రామాలయానికి వచ్చిన భక్తులు, పాపికొండలకు వచ్చే పర్యాటకులను ప్రైవేట్ వాహనాల ద్వారా ఐటీడీఏ వరకు తీసుకొచ్చి ఆహ్లాదాన్ని కలిగించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అసోంలోని ఆదివాసీ ఇళ్ల నిర్మాణం, ఏపీ, తెలంగాణలో నిర్మించే మట్టి ఇళ్లు, ఎండ్ల బండి, మంచెలను సిద్ధం చేశారు. పర్యాటకులు ఫొటోలు దిగేందుకు వెదురుతో నిర్మించిన సెల్ఫీ పాయింట్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వెదురుతో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయగా విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఆదివాసీ వంటకాలను రుచి చూపించనున్నారు. పిల్లల కోసం పలు స్పోర్ట్స్, బోటింగ్ ఇతర సదుపాయాలను సమకూర్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కేఎండీసీలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాల్లో సాంస్కృతిక సాహిత్య విభాగాల పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. సుజాత, స్వప్న, నందిని, లలిత, స్వాతి, శ్రీదేవి బృంద నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా కేయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ప్రశంసించారని చెప్పారు. పోస్టర్ పెయింటింగ్ విభాగంలో ఎండీ ఆయేషా తృతీయ బహుమతి సాధించిందన్నారు. కార్యక్రమంలో రామారావు, శ్యామలాదేవి, రామ కుమారస్వామి తదితరులు విద్యార్థినులను అభినందించారు.

విద్యార్థుల ఆందోళన



బాలికలతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఏన్కూరు: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సిలబస్ ఇంకా పూర్తి కాలేదని, విద్యాబోధన కుంటుపడిందని మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆదివారం ఆందోళన చేపట్టారు. టీచర్లు లేక తరగతులు జరగడం లేదని, పరీక్షలు సమీపిస్తున్నాయని, సిలబస్ పూర్తి కాలేదని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వచ్చి బాలికలతో మాట్లాడారు. విద్యాబోధనకు ఆటంకం లేకుండా ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో బాలికలు ఆందోళన విరమించారు. అనంతరం డీఈఓ పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు.

రౌడీషీటర్ అరెస్ట్

ఖమ్మంక్రైం: చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ పేరెల్లి ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. 2024 డిసెంబర్ 14న నగరంలోని ఇందిరానగర్‌లో రోడ్డును ఆక్రమించి, వేసిన రేకుల షెడ్‌ను విధి నిర్వహణలో భాగంగా తొలగించి వెళ్తున్న మున్సిపల్ సిబ్బందిపై దాడిచేయడంతోపాటు ఐరన్‌రాడ్‌తో జేసీబీ అద్దాలను ప్రవీణ్‌కుమార్, అతని సోదరుడు రవికుమార్ ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని, అప్పటి నుంచి పరారీలో ఉన్న వీరిని అరెస్ట్ చేశామని సీఐ వెల్లడించారు. ప్రవీణ్‌కుమార్ సుమారు 21 కేసుల్లో అరెస్టయి, జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరుగుతున్నాడని సీఐ బాలకృష్ణ వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి


ఎర్రుపాలెం: మండలంలోని రామాపురంలో ఆదివారం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ వెంకటేష్ కథన ప్రకారం.. రామాపురం శివారులో కొందరు కోడి పందేల స్థావరం ఏర్పాటు చేసినట్లు సమాచారం అందటంతో సిబ్బందితో ఎస్ఐ ఆకస్మికంగా దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.8,660 నగదు, 7 సెల్‌ఫోన్‌లు, 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పేకాట స్థావరాలపై..

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: మండలంలోని బూడిదంపాడు శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.3 వేల నగదు, ఏడు బైకులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. కాగా, బల్లేపల్లి చెరువు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.22 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం అర్బన్ (ఖానాపురంహవేలి) సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

కూచిపూడి కళాకారిణి మృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన మొట్టమొదటి కూచిపూడి నృత్య కళాకారిణి ఉప్పలూరి వరలక్ష్మి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కాగా భద్రాచలం పట్టణంలో దాదాపు 35 ఏళ్ల పాటు ఎందరినో తీర్చిదిద్ది రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో వీరు శిష్య బృందం చేత నాట్య ప్రదర్శన చేయించారు. ఇందులో తానే స్వయంగా మూడు వేలకు పైగా నాట్య ప్రదర్శనలు చేశారు. ఆమె మృతి పట్ల పట్టణ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20.506

రైతు భరోసాకు కసరత్తు..!

సాగు భూమికే పథకం వర్తిస్తుందన్న ప్రభుత్వం

- రెండు సీజన్లకు రూ.12వేల చొప్పున ప్రకటన
- సీలింగ్‌పై స్పష్టత కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మంది రైతులకు వర్తించే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: రైతు భరోసా పథకం అమలుపై రాష్ట్రప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఇప్పటికే రుణమాఫీ పథకాన్ని అమలుచేయగా.. పంటల సాగుకు పెట్టుబడి సాయంగా 'రైతు భరోసా'పథకం అమలుకు సిద్ధమవుతోంది. సాగు భూములకు మాత్రమే పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించడం ద్వారా రైతులకే లబ్ధి చేకూర్చేలా మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా పంటల సాగుకు పెట్టుబడి సాయంగా 'రైతుబంధు 'పథకాన్ని 2018లో ప్రవేశపెట్టింది. వానాకాలం, యాసంగి సీజన్లలో పథకాన్ని వర్తింపజేస్తూ పట్టా భూమి కలిగిన రైతులకు ధరణి ఆధారంగా ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు సీజన్లలో జమ చేశారు. ఆరేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని అమలు చేసింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి సాయంగా అందిస్తామని ప్రకటించినా రూ.12 వేలు మాత్రమే చెల్లించనున్నట్లు తాజాగా వెల్లడించింది.

సంక్రాంతికి ప్రకటించినా..

సంక్రాంతి అంటే ప్రధానంగా రైతుల పండుగ. ఈ రోజున రైతు భరోసా పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావించినా ఆ తర్వాత ఈనెల 26 నుంచి అమలవుతుందని ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుభరోసా పథకంపై ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. గుట్టలు, రాళ్లతో కూడిన భూములకు కాకుండా సాగు భూములకు రైతుభరోసా పథకాన్ని అమలు పరిచేలా సర్వే విధానంపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు సమాచారం.

సాగు భూమికే వర్తింపు

సాగులో ఉన్న భూమికే రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం పట్టా ఉన్న ప్రతీ భూమికి ఎకరాకు రూ.5వేల చొప్పున ఇస్తూ వందలాది ఎకరాలు ఉన్న వారికి కూడా అమలు చేసి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. దీంతో రైతు భరోసా అమలుకు సాగు భూమిని గుర్తించేందుకు క్రాప్ బుకింగ్(పంట నమోదు) విధానాన్ని ప్రామాణికంగా తీసుకున్న వ్యవసాయ శాఖ మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రిమోట్ సెన్సింగ్ ద్వారా బుకింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యాన సాగు భూములను గుర్తించడంతో పాటు గ్రామసభల ద్వారా అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరిగినా.. కేబినెట్ భేటీ అనంతరం సీఎం దీనిపై ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

రెండు సీజన్లకు ఒకేసారి..

ప్రస్తుత ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్లకు రైతుభరోసాను ఒకేసారి అందించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎకరాకు రూ.12 వేలు ఒకేసారి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో పథకంపై చర్చించినా రెండు సీజన్లవి కలిపి ఒకేసారి జమ చేస్తారా, ఇప్పటికైతే యాసంగి సీజన్‌కే విడుదల చేస్తారా అన్న అంశాన్ని మాత్రం వెల్లడించలేదు.

గతంలో రైతుబంధు అమలు ఇలా.. (ఒక్కో సీజన్‌కు)

జిల్లా	అర్హులైన రైతులు	మంజూరైన నిధులు
ఖమ్మం	3,42,799	రూ.360.30 కోట్లు
భద్రాద్రి	1,78,541	రూ. 269.71 కోట్లు

సీలింగ్ లేనట్లేనా?

పంటల పెట్టుబడి సాయంగా అందించే రైతుభరోసా పథకానికి సీలింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం తొలుత ఆలోచించినట్లు తెలిసింది. ఆతర్వాత ఈ ఆలోచనను విరమించుకుని సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా సన్న, చిన్నకారు రైతులకు సంపూర్ణంగా లబ్ధి జరుగుతుందని, అర్హులకే ఫలాలు అందుతాయని ప్రభుత్వం అభిప్రాయపడినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మందికి లబ్ధి

ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలు చేసే క్రమాన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో మొత్తంగా సుమారు 5లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఉమ్మడి ఖమ్మం దాదాపు 11.50 లక్షల వరకు రైతుల భూములు ఉన్నాయి. అయితే ఇందులో గుట్టలు, రాళ్లు, సాగుకు యోగ్యం కాని భూములు కూడా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాల వరకు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 4 లక్షల ఎకరాల వరకు రైతుల భూములు ఉన్నట్లు అంచనా. ఖమ్మం జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ధరణిలో చేర్చిన రైతుల సంఖ్య 3.42 లక్షల మంది కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.78 లక్షల మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు లెక్కల ప్రకారం ప్రతి సీజన్‌లో ఖమ్మం జిల్లాకు రూ.360కోట్లు, భద్రాద్రి జిల్లాకు రూ.269 కోట్లు ప్రభుత్వం విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. రైతుభరోసా పథకంలో ప్రస్తుతం ఉన్న రైతుల్లో 95 శాతానికి పైగా మందికి వర్తించే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయిలో విధివిధానాలు, మార్గదర్శకాలు విడుదలైతే అర్హుల సంఖ్యపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంమామిళ్లగూడెం: గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఆదివారం ఖమ్మం వైరారోడ్‌లోని కోణార్క్ హోటల్ ఫంక్షన్‌హాల్లో ఆమె జిల్లా గంగపుత్ర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రసంగించారు. గంగపుత్రుల కోసం ప్రత్యేకంగా ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేయడమే కాక వారు వ్యాపారంలో అధిక లాభాలు పొందేలా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ గంగపుత్రుల డిమాండ్ల సాధనకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షులు గడప శ్రీహరి, జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర గంగపుత్ర సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చేతి కృష్ణ, కార్యదర్శి డోలి శ్రీనివాస్, కోశాధికారి కందరబోయిన మురళికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కన్నం వైష్ణవి, పెద్దపల్లి సుధాకర్, దేశబోయిన సురేశ్, పాక ఓంప్రకాష్, పాకాల ఉపేందర్, అంబటి సుధాకర్, దేశబోయిన తిరుపతయ్య, వంగాల వెంకట్, దేశబోయిన సురేశ్, మల్లేశం, పిల్లి సుదర్శన్, కన్నం రమేశ్, కీర్తి శ్రీనివాస్, సింగం అంజయ్య, పూస కిరణ్, జీజుల రోహిత్, కుడుముల సత్యనారాయణ, సింగు శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

మూలం సంత ప్రారంభం



మూలం సంతను ప్రారంభిస్తున్న నీరజ

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వీడీవోస్‌కాలనీలో ఉన్న సమీకృత మార్కెట్‌లో గ్రామ భారతి తెలంగాణ, శ్రీపుష్టి ఆర్గానిక్స్, ఇండస్ క్లౌడ్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూలం సంతను ఆదివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ఈ సంతలో విక్రయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నల్లమల వెంకటేశ్వరరావు, మాధవి, నరేంద్రస్వరూప్, బసవ పున్నయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో జీవనం సుఖమయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల: యోగాతో మనిషి జీవితంగా సంపూర్ణంగా, సుఖమయంగా ఉంటుందని కొణిజర్ల ఎంఈఓ డి.అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని తనికెళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ అబ్రహం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 8 నుంచి 61 ఏళ్లలోపు యోగా అభ్యాసకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజయం సాధించిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. రామన ఝాన్సీలక్ష్మి నిర్వాహకురాలిగా వ్యవహరించిన ఈ పోటీల్లో తనికెళ్ల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లేడిబోయిన గోపాల్‌రావు, తనికెళ్ల పీడీ శ్రీనివాస్, యోగా ప్రజా సమితి తెలంగాణ శాఖ సభ్యులు ప్రసాద్, యశ్‌పాల్, పాపిరెడ్డి, యోగా గురువులు గోపాలపురం సత్యనారాయణ, కోదండరామ్, సరిత, పద్మ, శిరీష, పారాలీగల్ పాలిశెట్టి పద్మావతి, చలమల హైమావతి, లక్ష్మీ కాంతమ్మ, పర్వతారోహకుడు మోతీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆశీర్వాదంతోనే ఎమ్మెల్సీనయ్యా..



ఎమ్మెల్సీ మధుసూదన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతోనే ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని తాత మధుసూదన్ తెలిపారు. ఎమ్మెల్సీగా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కేక్ కట్ చేశారు. తనపై ఇంత అభిమానం చూపుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధికారం ఉన్నా లేకున్నా కేసీఆర్ నేతృత్వంలోనే సేవలు అందిస్తూ, నాయకులకు, కార్యకర్తలకు అనునిత్యం అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సామినేని హరిప్రసాద్, భాషబోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, తాళ్లూరి జీవన్‌కుమార్, బిచ్చాల తిరుమల్‌రావు, పగడాల నరేందర్, కోడిరెక్క ఉమాశంకర్, నెమలికొండ వంశీ పాల్గొన్నారు.

స్నేహితుడిని రక్షించబోయి..

సాగర్ కాల్వలో గల్లంతైన యువకుడు



పరిమి శివ



శివ ఆచూకీ కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

కల్లూరురూరల్: సెల్ఫీ తీసుకునే క్రమంలో సాగర్ కాల్వలో పడిపోయిన స్నేహితుడిని రక్షించేందుకు దిగిన యువకులు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఆదివారం సెలవు కావడంతో కల్లూరుకు చెందిన కల్యాణ్, గోకవరం గ్రామానికి చెందిన పరిమి శివ సాగర్, ఎదుకూరి సంపత్ ప్రధాన కాల్వ వద్దకు చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి సెల్ఫీ దిగేందుకు యత్నించిన ఎదుకూరి సంపత్ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడగా తన స్నేహితుడిని రక్షించే క్రమంలో పరిమి శివ కాల్వలో దిగాడు. ఈ ఘటనను చూసిన సమీపంలోని కొందరు సంపత్‌ను రక్షించగలిగారు. కానీ, పరిమి శివ మాత్రం నీటిలో కొట్టుకుపోయాడు. స్థానిక గజ ఈతగాళ్లు ఎంత ప్రయత్నించినా శివ ఆచూకీ లభ్యం కాలేదు. సాగర్ కాల్వ ప్రవాహాన్ని నిలిపివేసేందుకు పోలీసులు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ అధికారులు అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం వరకు కూడా సాగర్‌నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. కాగా, పరిమి శివ తండ్రి గతంలోనే చనిపోయాడు. తల్లి పరిమి విజయమ్మ, సోదరితో కలిసి శివ ఉంటున్నాడు. విజయమ్మ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. పరిమి శివ కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఎస్ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంగళరావు



వెంగళరావు



మాట్లాడుతున్న విజయ్

ఖమ్మంసహకారనగర్: టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి.వెంగళరావును, జిల్లా కార్యదర్శిగా బీవీఆర్ కోటేశ్వరరావును ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కమిటీ తెలిపింది. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏవీ నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గంలో వెంగళరావు, కోటేశ్వరావును ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి విజయ్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, మనోహర్‌రాజు మాట్లాడారు. సమావేశంలో ఆళ్ల రామారావు, ముత్తయ్య, మల్లయ్య, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మయ్య, కృష్ణ వర్గాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంతకాలంగా పంట కాలువ విషయంలో ఇరువురికి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల వారు గొడవ పడి రోకలిబండ, కర్రలతో ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ముగ్గురిపై..

మండలంలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన కొనకంచి మధుసూదన్‌రావు, నర్సింహారావు, లక్ష్మిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జమ్ముల కృష్ణారెడ్డికి చెందిన ఇంటి స్థలంలోకి మధుసూదన్‌రావు, నర్సింహరావు, లక్ష్మి అక్రమంగా ప్రవేశించి, గొడవ పడి చంపుతామని బెదిరించారు. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

తల్లిని చూసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో తనయుడు మృతి



ఎస్‌కే అఫ్జల్ హుస్సేన్ (ఫైల్)

వేంసూరు: సెలవు వచ్చిందని తల్లిని చూసేందుకు వెళ్తూ మార్గ మధ్యలో తనయుడు మృతి చెందిన ఘటన వేంసూరులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లికి చెందిన ఎస్‌కే అఫ్జల్ హుస్సేన్ (20) సత్తుపల్లిలో ఓ ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్నాడు. సత్తుపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తన పెదనాన్న సైదులు ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం నూజివీడులో ఉంటున్న తన తల్లి జరీనాను చూసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మండలంలోని పెట్రోల్ బంక్‌లో తన ఎక్స్‌ఎల్ మోపెడ్‌లో పెట్రోల్ పోయించుకున్న రావిలాల నాగేశ్వరరావు ప్రధాన రహదారి పైకి రాగానే రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. అఫ్జల్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వీర ప్రసాద్ తెలిపారు. అఫ్జల్ తండ్రి షాజమాన్ 2009లో మృతి చెందిగా రోడ్డు ప్రమాదంలో కుమారుడి మృతితో తల్లి రోదనలు మిన్నంటాయి.

అధికారులను బురిడీ కొట్టించిన వ్యాపారి..?

ఇల్లెందు : క్రయ విక్రయాలకు అనుమతి ఉన్న ఓ వ్యాపారి దర్జాగా మార్కెట్ అధికారులనే బురిడీ కొట్టించారు. ఆ వ్యాపారీ తతంగం గమనించిన మార్కెట్ అధికారులు ఖంగు తినాల్సి వచ్చింది.. ఇల్లెందు మండలం ముకుందాపురం ఏరియాకు చెందిన ఓ వ్యాపారికి క్రయవిక్రయాల అనుమతి ఉంది. దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. ఎరువులు పురుగు మందులు విత్తనాలు విక్రయిస్తారు. రైతులకు పెట్టుబడి పెడతారు. వారి నుంచి పండిన పంటంతా లాగేసుకుంటారు. కానీ ఆ పంటను మాత్రం మార్కెట్ రిజిస్టర్లలో నమోదు చేయకుండా మాయం చేస్తున్నారు. మార్కెట్ ఫీజు ఎగనామం పెట్టాలనే దురాశతో దర్జాగా జీరో వ్యాపారం చేస్తున్నారు. కొద్దిపాటి వ్యాపారం రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారు. దానికి తగినంత ఫీజు కూడా మార్కెట్‌కు చెల్లించడం లేదు. అయితే అకస్మాత్తుగా మార్కెట్ అధికారులు ఆ షాప్‌ను తనిఖీ చేశారు. మార్కెట్ రిజిస్టర్లలో నమోదు చేసిన పంటకు తన వద్ద దాచుకున్న రహస్య ఖాతా పుస్తకాలకు చాలా తేడా ఉన్నట్లు గుర్తించి ఆ రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తిస్థాయి పరిశీలన చేసి తగు చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. జరిగిన తతంగాన్ని అటు జిల్లా ఉన్నతాధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు మార్కెట్ చైర్మన్, పాలక వర్గం దృష్టికి తీసుకుని వెళ్లి అతని మీద కఠిన చర్యలు తీసుకోవాలనే సమాలోచనలు చేస్తున్నారు. ఈ విషయమై మార్కెట్ సెక్రటరీ నరేష్‌ను వివరణ కోరగా.. పరిశీలన చేస్తున్నామని, త్వరలో ప్రజల ముందు ఉంచుతామన్నారు.

14 పశువుల పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం మీదుగా అక్రమంగా పశువులను తరలిస్తుండగా బొలేరో వాహనాన్ని బ్రిడ్జి పాయింట్‌లో ఉన్న చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కూనవరం మండలం పరిధిలో గల వీఆర్‌పురం నుంచి సుజాతనగర్‌కు అక్రమంగా తరలిస్తున్న రెండు గేదెలు, ఆరు దున్నపోతులు, పెయ్య దూడ, దున్నపోతు పిల్లలను రెండు బొలెరో వాహనాల్లో మొత్తం 10 పశువులను తరలిస్తున్నారు. ఈక్రమంలో భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పట్టణ పోలీసులు పట్టుకుని పశువులను తరలిస్తున్న ఐదుగురికిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. పట్టుబడిన పశువులను పాల్వంచలో గల గోశాలకు తరలించామన్నారు. అదేవిధంగా ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో చింతూరు మండలం కుసుమపాడు నుంచి కుక్కునూరు మండలం వెలేరుపాడు గ్రామానికి ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మూడు ఆవులు, ఒక దూడను చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు.

చెరకు ట్రాక్టర్ తగిలి ఇద్దరికి గాయాలు



ఖమ్మం తరలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: చెరకు ట్రాక్టర్ తగిలి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన ఎస్.వెంకన్న, జర్పుల హనుమంతు ఆదివారం రాత్రి నేలకొండపల్లి నుంచి ఇంటికి వెళ్తున్నారు. గ్రామంలోకి రాగానే అటు నుంచి ఫ్యాక్టరీకి వస్తున్న ఓ చెరకు ట్రాక్టర్ బైక్‌కు తగిలింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా ఖమ్మం తరలించారు.

కారు, బైక్ ఢీ..

- ముగ్గురు యువకులకు గాయాలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని రుద్రంపూర్ జాతీయ రహదారిపై కారు, బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఆదివారం రామవరం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను బంధువులు, స్థానికుల ఇలా తెలిపారు. రుద్రంపూర్ నుంచి కొత్తగూడెంకు బైక్‌పై అదే ప్రాంతానికి చెందిన వి.ప్రభుకుమార్, ఇ.శివ, సాయి అనే ముగ్గురు యువకులు కొత్తగూడెంకు వెళ్తున్నారు. ఈక్రమంలో విజయవాడ నుంచి వస్తున్న కారు రుద్రంపూర్ పార్కు సమీపంలోకి రాగానే ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వస్తున్న యువకులకు గాయాలు కాగా స్థానికులు పోలీసులు, 108కు సమాచారం అందించి వారిని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒక యువకుడికి తీవ్రగాయం కాగా ఖమ్మానికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం: నగరంలోని పీఎస్ఆర్ రోడ్డులో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.1,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బూర్గంపాడు: పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని చెరువుసింగారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కాలువ వద్ద అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో ఎస్ఐ రాజేష్ తమ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో వెళ్లి దాడులు నిర్వహించారు. దీంతో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.18,050 నగదు, మూడు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి ఎస్ఐ తెలిపారు.

హైడ్రా మళ్లీ వీకెండ్ ఆపరేషన్

▶ మొదటి పేజీ తరువాయి

ఏవీ రంగనాథ్ శనివారం అక్కడ పర్యటించి పూర్వాపరాలు తెలుసుకున్నారు. హైడ్రా ఏర్పాటైన తొలి నాళ్లలో దాదాపు ప్రతి వీకెండ్‌లోనూ ఓ అక్రమ నిర్మాణం కూల్చివేత ఉండేది.

అక్రమ నిర్మాణాలెన్నో..

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో అనేక అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. 100 ఫీట్ల రోడ్డులో ఉన్న 684 చదరపు గజాల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఐదు అంతస్తుల్లో ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది అక్రమ నిర్మాణమని గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు.. గత ఏడాది ఫిబ్రవరి 14న షోకాజ్ నోటీసులు, 26న స్పీకింగ్ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిని భవన యజమాని హైకోర్టులో సవాల్ చేశారు. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం అది అక్రమ నిర్మాణమని తేల్చి, కూల్చివేయాలని గత ఏడాది ఏప్రిల్ 19న ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసీ అధికారులు.. గత ఏడాది జూన్ 13న ఆ భవనం స్లాబ్‌కు అనేక చోట్ల పెద్ద పెద్ద రంధ్రాలు చేసి విడిచిపెట్టారు. వాటిని పూడ్చేసిన యజమాని నిర్మాణం కొనసాగిస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం దీనిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఇటీవల సదరు అక్రమ నిర్మాణంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

రాత్రి 8 గంటల వరకు..

క్షేత్రస్థాయిలో పర్యటించిన ఏవీ రంగనాథ్, భవనాన్ని కూల్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఆ భవనం వద్దకు చేరుకున్న 'బాహుబలి క్రేన్'కూల్చివేత మొదలు పెట్టింది. రాత్రి 8 గంటల వరకు కూల్చివేత కొనసాగింది. అక్కడ పోలీసులు, హైడ్రా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భవనం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో విద్యుత్ సరఫరా ఆపేయడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలన్నింటినీ కూల్చివేస్తామని హైడ్రా అధికారులు తెలిపారు.

అనుమతిచ్చిన అధికారుల వివరాలపై ఆరా తీస్తున్నాం..

హైకోర్టు అక్రమం అని తేల్చినా భవన నిర్మాణం కొనసాగడానికి కారణమైన అధికారుల వివరాలు ఆరా తీస్తున్నాం. బాధ్యులపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం. అయ్యప్ప సొసైటీలో దాదాపు అన్నీ అక్రమ నిర్మాణాలే. ఆ భవనాలకు ఫైర్ ఎన్‌ఓసీ, భవన నిర్మాణ అనుమతి కూడా లేదు. అయ్యప్ప సొసైటీలో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీతో కలిసి సమీక్షిస్తాం. హైకోర్టు నుంచి స్పష్టమైన కూల్చివేత ఉత్తర్వులు ఉన్న వాటిని తొలి దశలో కూల్చేస్తాం.

–ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

అడుగడుగునా కమీషన్లు..

స్కామ్‌ల పరం.. అమరావతి పురం!

ఏపీ సర్కారు రియల్ ఎస్టేట్ వెంచర్ 'హ్యాపీ నెస్ట్' టెండర్లలో అక్రమాలు

- రాజధాని అమరావతిలో గెజిటెడ్ ఆఫీసర్ల కోసం జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లతో సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 మాత్రమే. ఇక హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో జీ+18 అంతస్తులతో 12 టవర్లలో 1,200 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ మాత్రం నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 చొప్పున నిర్దేశించారు. నిజానికి అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గాల్సింది పోయి ఇక్కడ అమాంతం పెరిగిపోయింది. హ్యాపీ నెస్ట్.. గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్లు.. ఇవి రెండూ షీర్ వాల్ టెక్నాలజీతోనే నిర్మాణాలు చేపడతారు. వాటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే. కానీ నిర్మాణ వ్యయం మాత్రం వేర్వేరు.
- అధునాతన సదుపాయాలు, నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగించి కట్టే బహుళ అంతస్తుల భవనాల్లోనూ (టవర్స్) నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు మించదని (జీఎస్టీ, సీనరేజీ లాంటి అన్ని పన్నులతో కలిపి) విజయవాడ–గుంటూరు, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రతిష్టాత్మక రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన పేరు మోసిన బిల్డర్లు చెబుతున్నారు. కానీ.. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారి రాజధాని అమరావతిలో చేపట్టిన హ్యాపి నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులో మాత్రం చదరపు అడుగు నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 ఉంది. దీన్ని బట్టి ఒక్కో చ.అడుగుకు రూ.2,500కిపైగా అంచనా వ్యయాన్ని పెంచేసినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు.
- రెండు మూడు సంస్థలు జాయింట్ వెంచర్(జేవీ)గా ఏర్పడి షెడ్యూలు దాఖలు చేయడానికి వీల్లేదని హ్యాపీనెస్ట్ టెండర్ నోటిఫికేషన్‌లో సీఆర్‌డీఏ నిబంధన విధించింది. కానీ ఆ ప్రాజెక్టు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 25 శాతం పనులను సబ్ కాంట్రాక్టు కింద అప్పగించే వెసులుబాటు కల్పించింది. దీన్ని బట్టి ముందే ఎంపిక చేసిన బడా కాంట్రాక్టు సంస్థకు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును అధిక ధరలకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకునే వ్యూహంతో 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు వెల్లడవుతోంది.

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణం ముసుగులో అమరావతిని కూటమి ప్రభుత్వం కుంభకోణాల మయంగా మార్చేస్తోంది. అడుగడుగునా కమీషన్ల దందాతో ఖజానాకు చిల్లు పెడుతూ అమరావతిని అక్రమాల పురంగా తీర్చిదిద్దుతోంది. హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచేసిన ప్రభుత్వం ఆ భారాన్ని ఇప్పటికే అడ్వాన్సు చెల్లించి ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారిపై మోపితే వ్యతిరేకత వస్తుందని పసిగట్టి దాన్ని రాష్ట్ర ఖజానా నుంచే సర్దుబాటు చేస్తోంది. అంటే.. ప్రభుత్వ ఖజానా నుంచి కాంట్రాక్టు సంస్థకు దోచి పెట్టి, వాటినే కమీషన్ల రూపంలో వసూలు చేసుకునేందుకు 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారి అవతారం ఎత్తి చేపట్టిన హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు టెండర్లలో భారీ ఎత్తున జరిగిన అక్రమాలను గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు బహిర్గతం చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. షీర్ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రెండింటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే అయినా హ్యాపీ నెస్ట్ నిర్మాణ వ్యయం చ.అడుగుకు రూ.2,500కిపైగా అదనంగా ఉండటమే అక్రమాలకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు.

షెడ్యూళ్లకు 8వతేదీ తుది గడువు

అమరావతిలో 2018లో నాటి టీడీపీ సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. నేలపాడు వద్ద 14.46 ఎకరాల్లో జీ+18 అంతస్తుల్లో 1,200 ఫ్లాట్లతో హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్నారైలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజల నుంచి అడ్వాన్సులు సేకరించింది. హ్యాపీ నెస్ట్ పనులను అప్పట్లో రూ.658 కోట్లకు సీఆర్‌డీఏ కాంట్రాక్టు సంస్థకు అప్పగించింది. అయితే అది ముందుకు కదల్లేదు. ఇప్పుడు అదే ప్రాజెక్టును టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టింది. గత టెండర్‌ను రద్దు చేసింది. తాజాగా రూ.818.03 కోట్ల వ్యయంతో 24 నెలల్లో పూర్తి చేయాలని గడువు నిర్దేశించింది. మూడేళ్ల పాటు



నిర్వహించాలనే నిబంధనతో ఎల్ఎస్ (లంప్సమ్ ఓపెన్) విధానంలో టెండర్లు పిలిచింది. టెండర్ల షెడ్యూళ్ల దాఖలుకు ఈనెల 8వ తేదీని తుది గడువుగా పేర్కొంది. అదే రోజు టెక్నికల్ బిడ్ తెరుస్తారు. ఆర్థిక బిడ్‌లను పదో తేదిన తెరిచి తక్కువ ధరకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన సంస్థకు పనులు అప్పగించే దిశగా సీఆర్‌డీఏ అడుగులు వేస్తోంది. జీఎస్టీ, ఎన్ఏసీ, సీనరేజీ లాంటి పన్నులు రూ.153.05 కోట్లు రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొంది. షీర్ వాల్ టెక్నాలజీతో అల్యూమినియం ఫ్రేమ్‌వర్క్, పోడియం, ఆర్కిటెక్చరల్ ఫినిషెస్.. బయట, లోపల విద్యుదీకరణ, ఎల్పీజీ లాంటి సౌకర్యాలతో హ్యాపీ నెస్ట్ ఫ్లాట్లను నిర్మించాలని టెండర్లలో పేర్కొంది.

తగ్గిన ధరలు.. అంచనాల్లో వంచన

హ్యాపి నెస్ట్ ప్రాజెక్టుకు 2018లో తెరతీసిన ప్రభుత్వం.. అప్పట్లో పనులను కాంట్రాక్టర్‌కు రూ.658 కోట్లకు అప్పగించింది. కానీ.. ఆ ప్రాజెక్టు అప్పట్లో ముందుకు కదల్లేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. భవన నిర్మాణాల్లో వినియోగించే స్టీల్, సిమెంట్, కంకర తదితరాలతోపాటు విద్యుత్, శానిటరీ ఉపకరణాల దగ్గర నుంచి లిఫ్ట్‌ల వరకూ గతంతో పోలిస్తే ధరలలో పెద్దగా వ్యత్యాసం లేదు. నిజానికి 2018తో పోలిస్తే కొన్నిటి ధరలు ఇప్పుడు బాగా తగ్గాయి. ఇక ఇసుక పూర్తి ఉచితమని ప్రభుత్వమే చెబుతోంది. అలాంటప్పుడు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరగడానికి ఆస్కారమే ఉండదని ప్రముఖ బిల్డర్లు స్పష్టం చేస్తున్నారు. అలాంటిది హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువను రూ.818.03 కోట్లుగా నిర్ణయించి తాజాగా సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం, రూ.153.05 కోట్లను పన్నుల రూపంలో రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొనడంపై బిల్డర్లు విస్తుపోతున్నారు. వీటిని పరిగణలోకి తీసుకుంటే హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.971.08 కోట్లకు చేరుతోంది. ప్రాజెక్టులో మొత్తం నిర్మిత ప్రాంతం 21,52,349 చదరపు అడుగులు. ఈ లెక్కన చదరపు అడుగు నిర్మాణానికి రూ.4,511.76 చొప్పున వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన డిజైన్ కంటే మరిన్ని అధునాతన సదుపాయాలతో నిర్మాణం చేపట్టినా చదరపు అడుగుకు అన్ని పన్నులతో కలిపినా రూ. 1,800 నుంచి రూ.2 వేల లోపే నిర్మాణ వ్యయం అవుతుందని బిల్డర్లు తేల్చి చెబుతున్నారు. ప్రాజెక్టు అంచనాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్కొంటున్నారు.

అక్రమాలు ఇలా బహిర్గతం..

హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ రీతిలోనే.. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గెజిటెడ్ ఆఫీసర్లకు టైప్–1, టైప్–2 విధానంలో జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు మొత్తం నిర్మిత ప్రాంతం 27,24,080 చదరపు అడుగులు. దీన్ని పరిగణలోకి తీసుకుంటే చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 అవుతుంది. ఇక సీనరేజీ, ఎన్ఏసీ, జీఎస్టీ పన్నుల రూపంలో రూ.93.2 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. ఇవన్నీ కలిపినా గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.2,148.45 దాటదు. దీన్ని బట్టి హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగినట్లు సీఆర్‌డీఏ పిలిచిన టెండర్ల సాక్షిగా బట్టబయలైందని బిల్డర్లు చెబుతున్నారు.

పెట్టుబడులు రూ.1.98 లక్షల కోట్లు ఉద్యోగాలు 1.14 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలు సృష్టించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2025ని రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఆమోదించింది. పదేళ్లపాటు ఈ పాలసీ అమల్లో ఉంటుంది.

బిడ్డింగ్ ద్వారా డెవలపర్లకు ఆహ్వానం

విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, జియో థర్మల్, మినీ హైడల్, వేస్ట్ టూ ఎనర్జీ కేంద్రాల స్థాపనకు డెవలపర్ల నుంచి బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి, ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నాయి.

చౌకగా లీజుకు సర్కారీ భూములు..

డెవలపర్లకు ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ఇస్తారు. బిడ్డింగ్‌లో గెలిచిన సంస్థకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుగా నిర్ణయించి భూములను కేటాయిస్తారు. అనంతరం ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం లీజు ధరను ప్రభుత్వం పెంచనుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పంద (పీపీఏ) జరిగాక జిల్లా కలెక్టర్లతో లీజు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

కరెంటు ప్రైవేటుకూ అమ్ముకోవచ్చు

డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్ల లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి స్థలాలను కేటాయిస్తుంది.

ముందు వచ్చిన వారికే ప్రాధాన్యత

సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత సామర్థ్యం లభ్యత ఉందో.. ఆ మేరకు మాత్రమే అనుమతిస్తారు. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత లభించనుంది. సౌర, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు

నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించనుంది. వీటి ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు.

మహిళా సంఘాలతో సౌర విద్యుత్ కేంద్రాల స్థాపన

500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) నుంచి ఆసక్తి వ్యక్తీకరణను డిస్కంలు విడతలవారీగా ఆహ్వానించనున్నాయి. వారి నుంచి నిర్ణీత ధరకు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయి.

పీఎస్పీ ప్రాజెక్టులకు 45 ఏళ్ల లీజుకు స్థలాలు

పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల లీజుకు కేటాయిస్తారు. వీటి స్థాపన కోసం ప్రైవేటు డెవలపర్లను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తే, ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. 6 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి. 45 ఏళ్ల తర్వాత ప్రాజెక్టును ప్రభుత్వానికి బదిలీ చేయాల్సి ఉంటుంది. పీఎస్పీ విద్యుత్‌లో 80 శాతం తొలి హక్కు రాష్ట్రమే కలిగి ఉంటుంది.

హైబ్రిడ్ పవర్‌కు ప్రాధాన్యత..

ఒకే ప్రాంతంలో సౌర+పవన, పవన+ఫ్లోటింగ్ సోలార్, విండ్+ స్టోరేజీ, హైబ్రిడ్+స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ పాలసీ ద్వారా ప్రోత్సహించనున్నారు.

భారీ ప్రోత్సాహకాలు..

- పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు.
- టీజీ–ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులను సత్వరం జారీ చేస్తారు.
- పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను వర్తింపజేస్తారు.
- ప్రతి మెగావాట్‌కు 4 ఎకరాలు చొప్పున భూగరిష్ట పరిమితి చట్టం నుంచి మినహాయింపు కల్పిస్తారు.
- భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లిస్తారు.
- వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్ చెల్లింపుల నుంచి మినహాయింపు ఇస్తారు. ఇతర కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు అందుతాయి. జెన్‌కో, ట్రాన్స్‌కో సాంకేతిక సహకారం అందిస్తాయి.
- పీసీబీ నుంచి ఎన్‌ఓసీ మినహాయింపు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్ వాడుకుంటే 8 ఏళ్ల పాటు విద్యుత్ సుంకం మినహాయింపు కల్పిస్తారు.
- పీఎస్పీ ప్రాజెక్టులకు నీటి సుంకాన్ని తిరిగి చెల్లిస్తారు.

డిస్కంలకు విక్రయిస్తే ప్రత్యేక ప్రోత్సాహకాలు

- సూపర్‌వైజేషన్ చార్జీల మినహాయింపు.
- ఇతర సౌర, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ, ఇతర ప్రాజెక్టులకు 50 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు/గ్రామ సమాఖ్యలు ఏర్పాటు చేసే సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులతో పాటు వ్యక్తిగత గృహాలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ స్కూల్స్, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకు 100 శాతం స్టేట్ జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.

జిల్లా వార్తలు

పర్యాటక కల సాకారమయ్యేనా..?

- 'పూబెల్లి'అభివృద్ధి ప్రణాళికపై ఇటీవల కలెక్టర్ దిశానిర్దేశం
- బ్లాక్‌బెర్రీ దీవి సందర్శన తర్వాత కానరాని పురోగతి
- క్షేత్రస్థాయి అధికారుల్లో కనిపించని కదలిక





పర్యాటక కేంద్రంగా ఎంపిక చేసిన పూబెల్లి చెరువు (ఇన్‌సెట్) అధికారులతో చెరువు వద్ద సమావేశమైన కలెక్టర్ (ఫైల్)

ఇల్లెందురూరల్: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీని సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో పర్యాటకం కోసం అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని అందుకు అనువుగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవతో అన్వేషించారు. ఈ క్రమంలో మండలంలోని పూబెల్లి గ్రామాన్ని సందర్శించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీనికోసం పలుమార్లు గ్రామాన్ని సందర్శించి స్థానిక అధికారులకు దిశానిర్ధేశం చేశారు. కానీ కలెక్టర్ పర్యటన సందర్భంగా హడావుడి చేసున్న అధికారులు ఆతరువాత అటుగా చూడక పోవడంతో పూబెల్లి పర్యాటక క్షేత్రం కల సాకారమవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి.

బ్లాక్‌బెర్రీ దీవి సందర్శనతో సరి..

పూబెల్లిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించేలా గ్రామం నుంచి ఒక బృందాన్ని ములుగు జిల్లా పరిధిలోని బ్లాక్‌బెర్రీ దీవి సందర్శనకు పంపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శితో సహా ఎనిమిది మంది సభ్యులతో ప్రతినిధి బృందాన్ని డిసెంబర్ 26వ తేదీన సందర్శనకు పంపారు. మరుసటి రోజు వారు తిరిగొచ్చి ఎవరి పనులలో వారు నిమగ్నమైపోయారు. కనీసం సందర్శనలో గుర్తించిన విశేషాలు, అందుకు అనుగుణంగా పూబెల్లి ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పనులపై కనీసం ప్రతినిధి బృందంతో స్థానిక అధికారులు సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు.

కనిపించని కదలిక

జిల్లా కలెక్టర్ స్పష్టమైన ప్రణాళికతో దిశానిర్దేశం చేసి పది రోజులు గడిచినా క్షేత్రస్థాయి అధికారుల్లో మాత్రం ఎటువంటి కదలిక కనిపించడం లేదు. ఇదంతా కలెక్టర్ రూపొందించిన కార్యక్రమంగా భావించి మొక్కుబడి తంతు తరహాలో ముందుకు సాగుతున్నారు. వనరులు ఉన్నప్పటికీ ఒక గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తుల భాగస్వామ్యం తప్పనిసరి.

కానీ నేటికీ పూబెల్లిలో స్థానికులతో కలిసి సమావేశం నిర్వహించడం, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికను వివరించడం.. ఈ ప్రక్రియలో గ్రామస్తుల భాగస్వామ్యం ఎలా ఉండాలి.. వసతి, ఆహారం, విహారం, ఆటపాటలు తదితర రంగాలలో ఎవరు ఏమేరకు బాధ్యతలు తీసుకోవాలి.. అందుకు అనుగుణంగా యువత, మహిళలు, గ్రామపెద్దలను సమూహాలుగా చేసి నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయడం.. వంటి ప్రక్రియను అధికారులు మాటలకే పరిమితం చేశారు. ముందస్తుగా నిధులతో అవసరం లేని పనులను గ్రామస్తుల భాగస్వామ్యంతో ప్రారంభించాలన్న ఆలోచన కూడా చేయకపోవడం విచారకరం. పర్యాటక కేంద్రంగా నిర్ణయించిన పూబెల్లి చెరువు పరిసర ప్రాంతాన్ని శ్రమదానంతో బాగు చేయకుండా.. మాటలతో కాలం గడిపితే పర్యాటక క్షేత్రం కల సాకారమవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చైతన్యపరిస్తేనే సత్ఫలితాలు

ప్రజలతోపాటు అధికారులు కూడా చైతన్యవంతులైతేనే పర్యాటక క్షేత్రం లాంటి బృహత్‌కార్యం పట్టాలెక్కుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనికోసం అధికారులు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంతోపాటు నిధులతో అవసరం లేని పనులపై దృష్టి సారించాలి. ప్రజల్లో కదలిక తీసుకురావడం అంతతేలిక కాదన్న సత్యాన్ని అధికారులు గుర్తించి మసలుకుంటే నిర్ధేశించుకున్న ప్రణాళిక అనుకున్న సమయంలో లక్ష్యాన్ని చేరుతుంది. కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి అంశాల వారీగా స్థానిక అధికారులకు బాధ్యతలు అప్పగించి వారిని పర్యవేక్షించేలా ఒక అధికారికి బాధ్యతలు అప్పగిస్తే నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు బాటలు పడతాయి.

స్పష్టమైన ప్రణాళికతో..

పూబెల్లి గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను ఇటీవల గ్రామాన్ని సందర్శించిన సమయంలో అధికారులు, గ్రామపెద్దలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమగ్రంగా వివరించారు. గ్రామ పొలిమేరలో ఉన్న చెరువును కేంద్రంగా చేసుకొని పర్యాటకులు విడిది చేసేలా నాణ్యతతో గుడారాలు ఏర్పాటు చేయడం.. చెరువులో బోటింగ్‌కు ఏర్పాట్లు, సాయంత్రం సరదాగా ఆటలు ఆడుకునేందుకు వీలుగా స్థలాన్ని సరిచేయడం, ఆటవిడుపుగా సైక్లింగ్ చేసేందుకు మార్గం సిద్ధం చేయడం, సినిమాలలో మాదిరిగా రాత్రివేళ చలిమంటలు (క్యాంప్‌ఫైర్) వేసుకొనేలా ఏర్పాట్లు, రుచికరమైన ఆహారం అందించడం, రాత్రి వేళ వెలుతురు కోసం సోలార్ ప్లాంట్ ఏర్పాటు, లేదా సైలెంట్ జనరేటర్‌ను సమకూర్చడం, విడిదికి సమీపంలో టాయిలెట్ల నిర్మాణం తదితర సౌకర్యాలతోపాటు పర్యటకులు ఆటవిడుపుగా గ్రామాన్ని సందర్శించడం, సమీపంలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు గ్రామస్తులు వారికి గైడ్‌లుగా వ్యవహరించడం.. తదితర ప్రణాళికపై కలెక్టర్ దిశానిర్ధేశం చేశారు. నెల రోజుల్లో రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



పూబెల్లి గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ దిశానిర్ధేశం చేశారు. ఇప్పటికే గ్రామం నుంచి ఒక బృందాన్ని బ్లాక్‌బెర్రీ దీవి సందర్శనకు పంపాం. కలెక్టర్ సూచించిన ప్రణాళికకు అనుగుణంగా త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ధన్‌సింగ్, ఎంపీడీఓ, ఇల్లెందు మండలం

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీరభద్రస్వామి

కామేపల్లి : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి కోరారు. తపాలా శాఖలో కొనసాగుతున్న పథకాలపై కొమ్మినేపల్లిలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తపాలా శాఖలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోస్టాఫీస్ సేవింగ్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి అకౌంట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్ స్కీమ్, కిసాన్ వికాస పత్ర, సీనియర్ సిటిజన్ స్కీమ్, టైం డిపాజిట్, గ్రామీణ తపాలా జీవిత బీమా, వాహనాల బీమా వంటి అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, స్థానిక పోస్ట్‌మాస్టర్ పమ్మి వెంకటేశ్వర్లు, ఎస్ఓలు పాల్గొన్నారు.

ఆనాటి కళ ఏదీ?

- సింగరేణిలో ఏటా తగ్గుతున్న కార్మికులు
- ఇదే సమయాన పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- పదేళ్లలో 23వేల మంది కార్మికులు ఉద్యోగ విరమణ
- ఉత్పత్తి పెంపుతో ఉన్న కార్మికులపై భారం



భూగర్భగని నుంచి వస్తున్న కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గనులు, కాలనీలు గతంలో కళకళలాడుతూ ఉండేవి. ఇప్పుడు గనులు బోందల గడ్డను తలపిస్తుండగా, కాలనీలు వెలవెలబోతున్నాయి. భూగర్భ గనులను మూసివేసి వాటి స్థానంలో ఓపెన్‌కాస్ట్‌లు ఏర్పాటు చేయటం, గతంలో మనుషులు చేసే పనులను ఇప్పుడు యంత్రాలతో చేయిస్తుండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. గడిచిన 14 ఏళ్లలో దాదాపు 28 వేల మంది కార్మికులు పలు రకాల కారణాలతో ఇంటిబాట పట్టినట్టు కంపెనీ తన గణాంకాల్లో తెలిపింది. 2010–12లో 67,675 మంది, 2011–12లో 66,466 మంది కార్మికులు ఉండగా, అదే సింగరేణిలో ప్రస్తుతం 39 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారు. అయితే, ఏటా కార్మికుల సంఖ్య తగ్గుతున్నా యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 10 శాతం చొప్పున పెంచుతూ ఈ ఏడాది 72 మిలియన్ టన్నులకు చేర్చింది. ఈ కారణంగా ఉన్న కార్మికులపై భారం పడుతోందని వాపోతున్నారు. అదే విధంగా 2013–14లో 50.47 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసిన సింగరేణి 2023–24లో 69.86 మిలియన్ టన్నులు రవాణా చేసింది. అలాగే, ఓబీ విషయంలోనూ 2013–14లో 170.29 లక్షల క్యూబిక్ మీటర్లు తీయగా, 2023–24లో 420.32 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయడం గమనార్హం.

సంవత్సరం	కార్మికుల సంఖ్య	ఉత్పత్తి లక్ష్యం (మి.టన్నుల్లో)
2013-14	61,778	50.47
2014-15	58,837	52.54
2015-16	58,491	60.38
2016-17	56,282	61.34
2017-18	54,043	62.01
2018-19	48,942	64.40
2019-20	46,021	64.02
2020-21	43,895	50.58
2021-22	43,672	65.02
2022-23	42,733	67.14
2023-24	41,837	70.02
2024-25	39,600	72.00

ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా కోణిజర్ల మండల వాసి

హర్షం వ్యక్తం చేస్తున్న సన్నిహితులు, గ్రామస్తులు



శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్‌తో జాస్తి రవికుమార్

కొణిజర్ల: కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ(ఎస్‌యూ) రిజిస్ట్రార్‌గా కొణిజర్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన జాస్తి రవికుమార్ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో కామర్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజెస్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా ఈనెల 4న బాధ్యతలు చేపట్టారు. గోపవరానికి చెందిన జాస్తి పురుషోత్తం – నాగరత్నం దంపతుల కుమారుడైన రవికుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం కొణిజర్లలో, ఇంటర్, డిగ్రీ ఖమ్మంలో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.కామ్, ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేసి అదే యూనివర్సిటీలో కామర్స్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఎగ్జామినేషన్స్ బ్రాంచ్ అడిషనల్ కంట్రోలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కేరళ యూనివర్సిటీలో కామర్స్ ప్రొఫెసర్‌గా కూడా పని చేశారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన 24 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో విద్యాభివృద్ధికి కృషి చేశారు. కామర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, ఇండియన్ కామర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రవికుమార్ జాతీయ, అంతర్జాతీయ జర్నల్‌లో 40కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించడంతో పాటు ఏడు పుస్తకాలు రాశారు. 10 అంతర్జాతీయ, 45 జాతీయ సెమినార్‌లలో పాల్గొని తన గళాన్ని వినిపించారు. ప్రస్తుతం ఆయన వద్ద పదుల సంఖ్యలో యువతీ యువకులు డాక్టరేట్ శిక్షణ పొందుతున్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన రవికుమార్ శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్ భార్య ఇందు గృహిణి కాగా, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, ఆయనకు చిన్ననాటి మిత్రులు రాయల నరసింహారావు, కొణతం ఉమాశంకరరావు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కొణిజర్ల మండలంలో తన పూర్వ మిత్రుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎస్‌యూను ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.